ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక - 20, నవంబర్ 1996

# పుష్యరాగం

విశ్వం అర ఫర్లాంగు దూరం నుంచే తన మేనమామ కృష్ణమూర్తి ఇల్లు గుర్తుపట్టాడు. ఎందుకంటే అది హైదరాబాద్‌కు దూరంగా మియాపూర్ అనే ప్రాంతాల్లో పొలాల్లో విసిరేసినట్టు ఉంటుంది. పైగా ఆ పొలాల్లో ఐదారు ఇళ్ళు మాత్రమే ఉన్నాయి. వాటిలో ప్రత్యేకమయింది - కణ్వాశ్రమ్... కృష్ణమూర్తిగారు వృక్షశాస్త్రంలో డాక్టరేట్ చేశాడు.

మధ్యనే రీడర్‌గా రిటైర్ అయ్యాడు. కానీ ఆయన చూడ్డానికి యాభై ఏళ్ళ వాడిలా కన్పిస్తాడు ఎప్పుడూ సంతోషంగా ఉండడం, లేకపోతే నిశ్శబ్దాన్ని పాటించడం, అదీ కుదరకపోతే పుస్తక ప్రియుడిగా మారి, తనదే అయిన ఓ లోకవాసిగా అవతారం ఎత్తడం ఆయనలో ప్రత్యేకతలు.

విశ్వం ఆటో దిగాడు. గేటు తెరుచుకుని ఓసారి చుట్టూ చూశాడు. ఇంటిముందు వంద అడుగుల వైశాల్యంలో వదిలిపెట్టిన జాగాలో పెంచిన పెద్ద లాన్, వాటర్ పాండ్లు, పూలచెట్లూ విశ్వాన్ని చూసి "లోపలికి రండి" అన్నట్టుగా ఆకుల ద్వారా, పూల ద్వారా ఆహ్వానించాయి. వీధి తలుపు రెక్క ఒకటి తెరచి ఉంది. అప్పుడు కృష్ణమూర్తి వాలు కుర్చీలో నడుం వాల్చి ఉన్నాడు. ఆయన మొహానికి అడ్డుగా – ఆయన రెండు చేతులా పట్టుకుని ఉన్న పుస్తకం తన పేరు 'అభిజ్ఞానశాకుంతలం' అని చెప్తోంది. ఆయనకు తెలుగు, సంస్కృతం క్షుణ్ణంగా వచ్చు. ఇంగ్లీషు సరేసరి! ఇక వృక్షశాస్త్రంలో ఘనాపాఠే!! "మామయ్యా" అని పిల్చాడు విశ్వం. ఊహూ... అతనికి మౌనమే జవాబుగా దొరికింది. విశ్వానికి నవ్వొచ్చింది. మామయ్య తన రాకను ఎప్పుడు గమనిస్తాడో వేచి చూద్దామని సింగల్ సోఫాలో కూర్చుని చేతి వాచీని చూసుకుంటూ ఉండిపోయాడు.

ఐదు నిముషాల తర్వాత, పాలగ్లాసు తీసుకుని హాల్లోకి వచ్చిన లలితగారు ముందు విశ్వాన్ని చూసి 'ఎవరూ' అని ప్రశ్నించి ఆపైన "నువ్వటోయ్, విశ్వం" అనేసి, భర్త దగ్గరగా వెళ్ళి "స్వామీ! మనింటికి ఎవరో వచ్చారు, గమనించారా" అంటూ భర్తను వాస్తవంలోకి లాక్కొచ్చింది.

కృష్ణమూర్తి పుస్తకం మడిచి, ఆ పైన విశ్వాన్ని చూసి, "ఎప్పుడు వచ్చావురా? అమ్మా నాన్నా, అన్నయ్యా ఎలా వున్నారు" అంటూ పలకరించాడు.

విశ్వం సమాధానం చెప్తున్నాడు.

లలితమ్మ నవ్వుతూ 'తనెప్పుడు వచ్చాడో పాపం, మీరు పలకరిస్తే ఏమనుకుంటారోనని బొమ్మలా కూర్చుని ఉన్నాడు. మీ తన్మయత్వం, పరాకూ అలా ఉన్నాయి..." అంది.

"శకుంతల నవ మల్లికకు, మామిడిచెట్టుకూ పెళ్ళి జరిపిస్తోంది. ఆ ఘట్టంలో లోకం తెలియలేదనుకో. కాళిదాసుగారి ప్రతిభ అలాంటిది. ఊపిరి తీసుకోనివ్వడు..."

"అసలు మనం ఓ లోకంలో ఉన్నట్టు మీకు తెలుసా" అంటూ లలిత లోపలకు వెళ్ళింది.

విశ్వం హాలు పరకాయించి చూస్తున్నాడు. ఓ గోడకు వేసిన ఆయిల్ పెయింటింగ్ అందులో ఉన్నది ఒకే ఒకపొడవాటి చెట్టు. దూరంగా వనం ఉన్న దృశ్యం. ఆ చెట్టుకు శిఖరాగ్రాన పూసిన పువ్వుగా సూర్యబింబం. మరో గోడకు అదే చిత్రకారుడు గీసిన పెయింటింగ్. పూల చెట్లు మీద తల క్రింద చెయ్యి పెట్టుకుని వయ్యారంగా పడుకున్న ఓ సుందరాంగి. ఓ మూలగా స్టాండ్ మీద శ్రీ అరబిందో బస్ట్ సైజు పాలరాతి విగ్రహం.

లోపలి నుంచి లలితమ్మకాఫీ తెచ్చి విశ్వం చేతికి ఇచ్చి, అందర్నీ పేరుపేరునా అడుగుతోంది విశ్వం ఒక్కొక్కళ్ళ గురించి చెప్పి, "నువ్వెలా ఉన్నావ్, అత్తయ్యా" అని అడిగాడు.

"ఆ విషయం మీ మామయ్యను అడగవోయ్. ఎందుకంటే – నేనేదయినా చెప్పాననుకో – ఆడవాళ్ళు తమ ఆరోగ్యం గురించి ఎప్పుడూ నిజం చెప్పరు. అంటూ ఆట పట్టిస్తారు" అనేసి భర్తని చూసి, "అంతేనాండీ" అంది.

"నాకేం తెలుసోయ్"

"విశ్వం! మీ మామయ్య నన్నెప్పుడూ పట్టించుకోరయ్యా. అది అందరికీ తెలిసిన విషయమే. అసలీ పెద్దమనిషి, ఏ చెట్టుకో, పుట్టకో పుస్తె కట్టవలసిన మనిషి..."

కృష్ణమూర్తి గలగలా నవ్వేశాడు. విశ్వానికి అది నవ్వు అన్పించలేదు. ఆనందభైరవి రాగం అన్పించింది.

"అవునురా విశ్వం... నిజం చెప్పమంటావా? మాపెళ్ళి చూపులనాడు, మొదట మీ అత్తయ్య నాకు పింక్ రెడ్ గులాబీలాకన్పించింది... ఏమిటా ఇది అని మళ్ళీ చూశాను... పారిజాత కుసుమంలా ఊగుతూ కన్పించింది. కళ్ళు నులుముకున్నాను. పెద్దవి చేసి చూశాను – అప్పుడు అచ్చు మచ్చు అరవింద పుష్పంలా దర్శనమిచ్చింది. అంతే నాకు అమ్మాయి నచ్చిందనేశాను. దీన్నేమనాలంటావ్?"

ఈసారి నవ్వడం లలితగారి పని అయ్యింది. ఆ నవ్వులో పొడవాటి జీవితానుభవం – పండి, బిడియపడి, తేరుకోవడం కన్పిస్తోంది. ఆవిడ తన నవ్వుని కుడిచేతిని పెదాల మీదకు తెచ్చుకుని నవ్వుని ఆపుకుంటూ, తర్వాత అదే చేత్తో తల నోపక్కగా రాసుకుని – ఆ పైన ఎడం భుజం మీద ఉన్న పమిట కొంగును కుడిభుజం మీదకు లాక్కుంటోంది.

"అత్తయ్యా! ఈ ఇల్లు చూడ్డానికి చాలా బావుంది. కానీ ఇంత చిన్నిల్లు కట్టారేం? రెండు వేల గజాల స్థలంలో నాలుగు గదుల ఇల్లంటే, ఆశ్చర్యమే..." విశ్వం అడిగాడు.

"ఏమండీ వింటున్నారా? విశ్వం మాటలు..."

'అసలు ఈ కాంక్రీటు భవనం వద్దు... పర్ణశాల వేస్తానన్నాను. మీ అత్తయ్య పడనివ్వలేదు."

"చూశావుగా విశ్వం! ఇంటి ముందు, చుట్టూతా ఎంత స్థలం వదిలేశారో. ఈ పెద్ద పెద్ద చెట్లు మొక్కలూ, పూల వృక్షాలూ అంతా బాగానే ఉంది. ఆయన సంపాదనలో చాలా భాగం వీటి పోషణకే పోతోంది. ఫారిన్ వెళ్ళినప్పుడల్లా ఏవేవో మొక్కలు కొని తెచ్చుకుంటారు. అయినా ఫర్వాలేదు కానీ వీటి చాకిరీతో నా నడుం పడిపోతోందనుకో. ఏ మొక్క వాడినా, ఏ పువ్వు వడలినా – ఆ రోజంతా నాకు మూడినట్టే."

కృష్ణమూర్తి భార్య మాటలకు చిన్నగా నవ్వి, కళ్ళజోడు సర్దుకున్నాడు. "పిల్లల్ని పెంచడం కాదోయ్. మొక్కల్ని పెంచి పెద్ద చేస్తేనే మన సత్తా ఏమిటో బయటపడేది. అవి ఎదిగి,

పెరిగి మన కిచ్చే మానసిక ఆనందం, పిల్లల వల్ల దొరుకుతుందంటావా? మనిషి తను ఎదుగుతూ తన ఆలోచనల్నీ, తద్వారా హృదయాన్నీ మలిన పర్చుకోవడం మొదలుపెడతాడు. అదే మొక్కయితే... తను పూలు పూసి ఆ సువాసనలతో గాయపడ్డ ప్రతీ హృదయానికి వైద్యం చేస్తుంది."

విశ్వం నవ్వాడు.

లలిత ఓసారి గడియారం వైపు చూసి, "విశ్వం! నువ్వు లేచి స్నానం చేయి. ఎప్పుడనగా తిన్నావో – త్వరగా వంట కానిస్తాను" అంటూ కుర్చీలోంచి లేచి లోపలికి వెళ్ళింది.

"ఒరే విశ్వం! ఈ వేళ మనిద్దరం కలిసి మా మొక్కలకు నీళ్ళు పోద్దాం. ఆ తర్వాత స్నానం చేదువుగాని, పాంట్ మార్చి లుంగీ వేసుకో..." అంటూ లోపలికి వెళ్ళి తను నిక్కరూ, బనీను వేసుకుని వచ్చాడు.

విశ్వం షర్ట్ పాంటూ విప్పి లుంగీ కట్టాడు.

ఇద్దరూ ఇంటి ముందరున్న లాన్‌లోకి వెళ్ళారు. విశ్వం చుట్టూ చూశాడు. ఎక్కడా మాట అలికిడి లేదు. అలిసిన వెలుతురు. తూర్పు వైపు నుంచి వచ్చే సన్నని గాలి తాకిడికి పెద్ద చెట్లు తమ లేత పాటి కొమ్మలతో జవాబుగా ఊగుతూంటే, నేల మీద పరుచుకుని హరిత రంగుల నాడుల్లాంటి కొమ్మలతో ఉన్నవి – చంటి పిల్లాడు చటుక్కున పిలుపుకు తలెత్తి చూసినట్టు సుతారంగా కదలికలు చేస్తున్నాయి.

"విశ్వం! మొదటిసారి మా ఇంటికి వచ్చావు నువ్వు. మా వనం అందుకే నిన్ను కొత్తగా చూస్తోంది. పరిచయం చేస్తాను."

"మన బంధుత్వం వాటికీ పాటికి తెలిసే ఉంటుందిలే"

వీధి గుమ్మానికి ఎదురుగా కొంతదూరం వదిలిన తర్వాత, దీర్ఘ చతురస్రాకారంలో లాన్, అందులోని ఆకుపచ్చ గడ్డి తివాసీలా పెరిగింది. పదిమంది అందులో కూర్చుని ఈజీగా రిలాక్స్ కావచ్చు. లాన్‌కు నాలుగు మూలలా గుండ్రంగా ఆరడుగుల కైవారంలో ఒకదాంట్లో గులాబీలు, మరొక దాంట్లో డాలియాలు... క్రోటన్లు... చామంతులు... లాన్ పక్క నాపరాళ్ళతో రెండడుగుల నడవ... నడవ నానుకుని లాన్‌కు కుడి ఎడమల వాటర్ పాండ్స్, లాన్ చుట్టూ, వాటర్ పాండ్స్ చుట్టూ పచ్చదనానికి సవాల్‌గా ఎర్రగా పాకే అల్లామండాకాథరిలుకాల క్రీపర్లు... ప్రహరీ గోడ మీద రెయిలింగ్స్ వేశారు. వాటి మీద ఎరుపు, తెలుపు పింక్ కలర్ బోగన్‌విల్లాలు.

ఆ వాతావరణం విశ్వాన్ని కొత్త మనిషిని చేసింది. కృష్ణమూర్తి మోటార్ ఆన్ చేసి, మొక్కలకు నాజుగ్గా నీళ్ళు పోస్తున్నాడు.

"చూడు విశ్వం! ఇది ఇంటి ముందు భాగం. అలా తూర్పు వైపుకు పోదాం పద..."

అక్కడ తులసి, మందారాలు, మల్లెతీగలు, ఒక్కొక్క చెట్టు కాదు గుంపుల మాదిరి...

"మనలాగే ఇవీ ఈ పగటి ఎండకు ఉక్కపోసి తెగ బాధపడతాయి. కాస్త నీళ్ళు

తగిలితే మనలాగే ఫ్రెష్ అవుతాయి. ఆ తర్వాత చూడు – వాటి తల లూపడాలూ, ఊగిసలాటలూ…”

విశ్వం నవ్వేశాడు.

“విశ్వం! తెల్సుకోగలిగితే ఇవి మనతో మాట్లాడతాయి. మన భాషను అర్థం చేసుకుంటాయి.”

“అలానా?”

“ఈ చెట్టు చూడు…. దీని పేరు కాఫిర్ లిల్లీరా… దీని ప్రత్యేకత ఏమిటో తెలుసా… ఇవి మనలో ఉండే అహంకారాన్ని తగ్గించి ఆ చోటులో ప్రేమభావాన్ని నాటుతాయి.”

విశ్వం మళ్ళీ నవ్వాడు. ఇద్దరూ దక్షిణం వైపు వెళ్ళారు. అక్కడ ఓ పది యూక్లిప్టస్ చెట్లు ఎత్తుగా ఎదిగి ఉన్నాయి. కృష్ణమూర్తిగారు అక్కడ ఉన్న ఇతర చెట్ల పేర్లు చెబుతున్నాడు.

“దీని పేరు కాండీ కింగ్… ఇది దేవుని పిలుపునూ, ఆయన కరుణాకటాక్షాలను ముందుగా గ్రహిస్తుందంటారు. ఇది మార్నింగ్ గ్లోరి… ఈస్తటిక్ సెన్స్ అని మనం అటుంటాం చూడు – దాని ప్రతిరూపం.. ఆ… ఇది పెరలీ గేట్… మనలో స్వీయాపేక్షతను తొలగించి సర్వాన్నీ దైవానికి అంకితం చేసే తత్వాన్ని పెంచుతాయి…”

ఇద్దరూ అక్కడి నుంచి పడమటి వైపు వెళ్ళారు. రెండు కొబ్బరి చెట్లు దూరం దూరంగా ఉన్నాయి. వాటి మధ్య ఎత్తుగా ఎదిగిన పారిజాతపు చెట్లు.

“ఇవి చూడు… ఇవి ఇండియన్ లిలాక్. వీటి రేకులు చూడు. ఎలా వంకీలు తిరిగి ఉన్నాయో… ఇవి నక్షత్రాలకు నకళ్ళు. ఇవి చంపకాలు”.

తిరిగి నాలుగు అడుగులు వేశారు. “ఇవి జిన్నియా పుష్పాలు అదిగో ఆ రెండూ టీక్ చెట్లు. ఈ టాంక్‌లోవి అరవిందాలు. సృష్టిలో అరవిందం తరువాతే ఏ పుష్పాన్నయినా చెప్పాలి. మనిషిలో స్వచ్ఛతకు, పరిపూర్ణతకు, దైవాంశకు ఈ అరవిందాలు ప్రతీకలు.”

కృష్ణమూర్తి గారు నిశ్శబ్దంగా నాలుగు అడుగులు వేసి అక్కడ ఉన్న కేన్ కుర్చీలో కూర్చుని విశ్వానికి కుర్చీ చూపించాడు. అప్పటికే ఏడు గంటలయ్యింది.

“నా సొదతో నిన్ను విసిగించానేమిట్రా?”

విశ్వం – “లేదు మామయ్యా… ఏవో చెట్లూ, చేమలూ అనుకోవడమే గాని వీటి వెనుక ఇంత కథ ఉంటుందంటే ఆశ్చర్యం వేస్తోంది…”

“నేను బోటనీ చదువుతానంటే మా నాన్న మొదలు, ఇంట్లో అందరూ వెక్కిరించారు. పంతం పట్టి చదివాను. ఇన్నేళ్ళ తర్వాత నాకు ఒకటే అర్థం అయిందిరా. మనుషుల కన్నా చాలా చాలా ఉన్నతమైనవీ, ఉత్తమమయినవీ ఈ వృక్షాలూ, మొక్కలూ, పూవులూ…”

‘మామయ్యా! పుష్పాలకు గుప్త జ్ఞానం ఉంటుందని ఎవరో అనగా విన్నాను. నిజమేనా?”

"అది సత్యమేరా. మన విన్నపాలను, ప్రార్థనలను అవి ట్రాన్స్‌మిట్ చేయగలవు. కానీ వాటిని కదిలించే శక్తి మనం పొందగలగాలి. మేఘసందేశం చదవలా. యక్షుడు తన ఆవేదన ఎవరితో చెప్పుకున్నా డంటావ్... మనుషులతో కాదో వృక్షాలతోనే!! శకుంతల తన ప్రేమనూ విరహాన్ని ఎవరికి విన్నవించుకుంది? వీటికే కదా..." కృష్ణమూర్తి గారు ఆగి అన్నాడు. మళ్ళీ కాళిదాసు కవిత్వంలో ముఖ్యంగా నాటకాల్లో వృక్షాల్నీ, పుష్పాల్నీ పాత్రలతో సమానంగా నడుపుకు వచ్చాడు. ఆయన తోచకీ పని చేశాడంటావా? కాదే విజ్ఞానంతో, జిజ్ఞాసతో చేశాడు."

"మామయ్యా... ఒక మాట అడుగుతాను. నీకీ తత్వం ఎలా అలవడింది? ఎంతోమంది బోటనీ చదువుతారు. కానీ అందరూ నీలా, ఇలా" విశ్వం ఆగిపోయాడు.

"కొంతవరకూ నా చదువు. ఆ పైన సంస్కృతం నేర్వడం, సాహిత్యం మీద మక్కువా ఇవి నాకు దోహదపడ్డాయనుకుంటాను. పైగా ఏదో, ఓ యూనివర్సిటీ వాళ్ళు, పిలిచి వాళ్ళ విద్యార్థుల కోసం పుస్తకాలు రాయమనడం, ప్రభుత్వం వాతావరణం కలుషితం మీద సెమినార్స్ నడుపుతూ, వారి కమిటీకి నన్నో పెద్దగా నియమించడం. దీన్తో పుస్తకాల్లోకి లోతుగా వెళ్ళి పరిశీలన చేయవలసి వచ్చేది.

ఆ తహతహతోనే కాళిదాసు – విక్రమోర్వశీయం. అభిజ్ఞాన శాకుంతలం, కుమార సంభవాల్లో వృక్షశాస్త్రం, ఏ మేరన తన పాత్ర నిర్వహిస్తూ వచ్చిందో చూశాను. ఆయన అడుగడుగునా చెట్ల గురించీ పువ్వుల గురించీ, వాటి ప్రాముఖ్యం గురించీ చెబుతాడు. నాయికా నాయకులతో పాటు పుష్పరాజాలన్నీ పాత్రలై మనల్ని గిలిగింతలు పెడతాయి. ఆయన ఒక్కడే కాదు – అనాటి మహారచయితలందరూ ఈ శాస్త్రంలో నిష్ణాతులే అన్పిస్తుంది. అవన్నీ చదువుతంటే నాలో తపన, ఆతృత ఆశ్చర్యం పెరగడం మొదలు పెట్టాయి. ఆ గ్రంథాల్లో నాకు అర్థమయింది – అందరికీ చెప్పాలనే కోరికను ఆపుకోలేక – ఈనాటి పాఠకుల కోసం ఏదో రాస్తూ పోతున్నాను. మా గార్డెన్‌లో ఇన్ని చెట్లు నాటడంలో, పెంచడంలో కొంత సైంటిఫిక్ ఎప్రోచ్ ఉంది. ఆధ్యాత్మిక భావనా ఉంది."

విశ్వం మేనమామ వైపు చూశాడు. "నేను ఇంటర్‌లో ఉండగా మా హెడ్ ఆఫ్ ది సెక్షన్ ముత్తుస్వామి గారు ట్రీస్పిరిట్సు గురించి చెబుతూ మొదటి రోజు పాఠం మొదలుపెడితే – మేం నవ్వేశాం ఆ రోజు!! అయినా ఆయన కోప్పడలేదు. ఈ వేళ మీతరం వాళ్ళు నా మాటలు విని నవ్వినా. నేను తప్పు పట్టను!!"

సరిగ్గా అప్పుడే బయట నుంచి ఓ అమ్మాయి వచ్చింది. వస్తూనే కృష్ణమూర్తి దగ్గరకు వెళ్ళి తన చేతిలోని లిల్లీ పుష్పాలు ఆయనకు అందజేసి, వంగి ఆయన పాదలను తాకింది... ఆ పైన, "ఆంటీ ఉన్నారా అంకుల్" అని అడిగింది... ఆ తర్వాత విశ్వం వైపు కొత్తగా చూసి తలవంచుకుంది.

కృష్ణమూర్తి విశ్వం వైపు చూసి, "ఈమె మా కొలీగ్ రామారావు గారి అమ్మాయి!

పేరు కృష్ణవేణి, బోటనీలో రీసెర్చి చేస్తోంది... అదిగో... అదే ఇల్లు వీరిది..." అని "ఇతగాడు నా చెల్లెలు రెండో కొడుకు మద్రాసులో ఉంటాడు. పేరు విశ్వం. రిలయన్స్‌లో ఇంజనీర్"... అంటూ ఒకర్నొకొర్నికి పరిచయం చేశారు.

కృష్ణవేణి చేతులెత్తి నమస్కరిస్తే విశ్వం అదే పని చేశాడు.

కృష్ణవేణి లోపలకు వెళ్ళింది.

"ఇంకా పెళ్ళి కాలేదు. పై అమ్మాయికి మొన్ననే చేశారు. చదువులో దిట్ట. ఇంతలో లోపలి నుంచి లలిత, కృష్ణవేణీ వచ్చారు.

"వెడతాను ఆంటీ... అయితే ఓ రెండు నెలల పాటు మీకూ, ఆంటీకి ఆటవిడుపు..."

"మీ అత్తయ్య చెప్పిందేవిటి... ఎప్పటి నుంచో అనుకుంటున్నాం అమ్మా. ఉత్తర దేశయాత్ర చేయాలని ... ఇన్నాళ్ళకు కుదురుతోంది..."

"ఆంటీ! కాశ్మీర్‌లో అంకుల్‌ని అస్సలు ఒంటరిగా వదలద్దు... మీరు పరాకుగా ఉంటే ఇట్టే ఏ ఏపిల్ చెట్టుకో, మంచు పుష్పాల్లోకో అదృశ్యమయిపోతారు."

"నాకే హాయిలే... పోరు తప్పిందనుకుంటాను..." అంది లలితమ్మ నవ్వుతూ...

కృష్ణమూర్తిగారు లేచి సైకె పూవులూ, ఊదారంగులో ఉన్నవి కోసి కృష్ణవేణి చేతిలో పెట్టాడు.

"ఆ అమ్మాయికి ఇష్టమైన పూవులు ఆమె కోసుకుంటుంది. ఇన్ని రకాలు ఉండగా..."

'మావయ్యా... వ్యక్తిని బట్టీ, వ్యక్తిత్వాన్నీ బట్టీ వాళ్ళకు కావల్సిన పువ్వులు ఇస్తారు.. పెద్దవారు..." అంది కృష్ణవేణి.

లలితమ్మ విశ్వాన్ని చూపి, "నువ్వు లేచి స్నానం కానివ్వయ్యా... మీరూ కదలండీ" అంది బతిమలాడుతూ....

విశ్వం భోజనం చేసి ఆఫీసు పని మీద బయలుదేరాడు. కృష్ణమూర్తి "సాయంత్రం త్వరగా వచ్చేయిరా... భోజనం చేసి కాస్త రెస్ట్ తీసుకో... రేపు మళ్ళీ ఎక్కడో రిపోర్టు చేయాలన్నావు కదా?" అన్నాడు.

"అవును... రేపు కలకత్తాలో మావాళ్ళందరూ కలుస్తాం. అక్కడో కొత్త ప్రాజెక్టు మొదలవుతోంది..'

"విశ్వం బయటకు వెళ్ళడానికి గేటు తెరిచి ఓసారి మౌనంగా ఇంటివైపు చూసి కళ్ళు మూసుకున్నాడు.

కృష్ణమూర్తి విశ్వాన్ని గమనిస్తూనే ఉన్నాడు. చిన్నప్పుడు ఎప్పుడో తను విశ్వానికి చెప్పిన విషయం అది! ఇంట్లోంచి వెళ్ళే ముందు ఆ ఇంటిలో వ్యక్తులు – ఇంటికి "శెలవు తీసుకుంటున్నాను... మళ్ళీ వస్తాను...ఏం" అంటూ ఆప్యాయంగా చెప్పి వెళ్ళాలని – ఓ కథగా చెప్పాడు.

❖ ❖ ❖

ఆ సాయంకాలం కృష్ణమూర్తి, విశ్వం మామూలుగా మొక్కలకు నీళ్ళు పోశారు. లలిత గోంగూర పచ్చడి, ఉల్లిపాయ పులుసు, అప్పడాలు, వడియాలు చేసి అద్భుతమైన విందుకు అంకురార్పణ చేసింది.

తొమ్మిది గంటల తర్వాత కృష్ణమూర్తి గారూ, విశ్వం డాబా మీద పడుకున్నారు. విశ్వం మేనమామకు నిద్రపట్టిన తర్వాత డాబా మీద అటూ ఇటూ తిరిగాడు. ఓ పక్క నుంచి నైట్ క్వీన్ మీదగా వస్తున్న గాలి అతన్ని పరిమళ భరితుణ్ణి చేస్తోంది. పైనున్న నక్షత్రాలను, దొడ్లో వున్న చంపకాలు వెక్కిరించడం; మొగ్గల రూపంలో ఉన్న బొడ్డు మల్లెలు పైనున్న పాలపుంతను సవాలు చేయడం; నీలి ఆకాశం నిశా రహస్యాలను వివరిస్తూంటే వాటర్‌పాండ్‌లో ఉన్న నీలికలువలు నిశ్శబ్దంగా వాటికి చెవి వొగ్గడం... హేమంతకాలాన్ని చేమంతి చెట్లు తమ ఆకులతో ఆటలాడించడం; బహుళ పంచమి జ్యోత్స్నతో పృధివి మీద చీకటిని ఆసాంతం తరిమి కొట్టలేకపోయిన చందమామ పున్నమి రోజున భరతం పడతానని గొప్పలు పోవడం... విశ్వం మనసులో ఎటో పోతోంది...

విశ్వానికి చటుక్కున అరవింద గుర్తొచ్చింది. ఆమె రూపం కళ్ళ ముందు కదిలినట్టయ్యింది. రెండు వందల మైళ్ళ దూరంలో విజయవాడలో ఒక డాబా ఇంటిలో, ఒక గదిలో నిద్ర రాక ఆలోచనలు అల్లుకుంటూ, బాధలు శరీరాన్నీ, భయాలు మనసునూ వేధిస్తూంటే తలను మోకాళ్ళకు ఆనించి మంచం మీద కూర్చుని ఉంది.... క్షణం ఆగి బెడ్‌లైట్ వెలుగుని ఆసరా చేసుకుని, పుస్తకం తెరిచి, అది చదవలేక పక్కన పెట్టి ఓసారి నిట్టూర్చి, బయట నుంచి భయపెడుతూ కన్పిస్తున్న చీకటి చూసి తలదించుకుంది. కాసేపు ఆగి మంచం పక్క స్టూల్ మీద ఉన్న కూజా అందుకోబోయి అది చేతికి అందక నేలపాలయితే ఆ పైన పగిలితే, ఆ అలికిడికి పక్క గదిలోంచి తల్లివచ్చి నిద్రపోలేదా అని అడిగితే, అరవింద కళ్ళెత్తి తల్లిని చూడలేక చూపు తప్పించింది. ఊహూ అనే పొడిమాటతో సరిపెట్టి, మంచం మీద వాలిన అరవింద లీలగా కన్పిస్తూనే ఉంది.

అంతకు పూర్వమే పాదుకల వాత పడి మెలకువ వచ్చిన కృష్ణమూర్తి మేనల్లుడి విన్యాసాలు చూసి, అనుమానపడి "ఏరా విశ్వం నిద్రపట్టలేదా? ఆలోచనల్లో మునిగి, ఈదులాడ్డం చేతకాని వాడిలా అవస్థలు పడుతున్నావ్".

"మనసు బాగోలేదు మావయ్యా."

కృష్ణమూర్తి నవ్వేసి, "ఓస్ అంతేనా, ఏమిటో అనుకున్నాను. బాగా ఉంటే దాన్ని మనసని ఎందుకనాలోయ్... మనిషిని అవస్థల పాలు చేయడమే దాని ఆదర్శం... నువ్వు దాన్ని తోసిరాజను... అది నీకు జీ హుజూర్ అంటుంది. చిత్తం చిత్తం మహారాజా అనడం చేశావా... చిత్తవడం ఖాయం..."

విశ్వం చిన్నగా నవ్వి, కాసేపు ఆగి, తను రెండేళ్ళుగా ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నదీ వివరించాడు. అరవిందతో స్నేహం, అది ప్రేమగా రూపుదిద్దుకోవడం ఆ వైనం

వివరించాడు. ఆ తర్వాత తండ్రి సీతాపతి నుంచి ఎదురైన బెదిరింపులు హెచ్చరికలూ ఆ కథంతా చెప్పాడు.

"ఆయన ఇన్నేళ్ళయినా మారలేదు మావయ్యా. అదే మంకుపట్టు... ఈయనతో అమ్మకు రోజూ దినదినగండమే.... ఇంటిని పట్టించుకోడు... రాబడి ఏమవుతుందో చెప్పడు.... పగలు ఆఫీసు... రాత్రి క్లబ్బు ఇక అన్నయ్య వాసు ... బొంబాయి వదిలి పెట్టి రాడు... పాతిక ఏళ్ళు రాకుండానే జీవితంలో చేదునంతా చూసిన వాడిలా మాట్లాడతాడు..."

కృష్ణమూర్తి విశ్వం చేయిపుచ్చుకుని తన చేతుల్లోకి తీసుకున్నాడు. "అన్నీ సవ్యంగా జరుగుతాయి. నువ్వు ధైర్యంగా ఉండు. మీ నాన్నచెడ్డవాడు కాదురా... కానీ ఆయన ఫాల్స్‌హుడ్‌లో పడ్డాడు. ఎవర్నీ నమ్మకపోవడం... అందర్నీ అనుమానించడం మా బావ ప్రత్యేక లక్షణాలు... కానీ, మనం భయపడకూడదు."

"నేను గాని తన మాట కాదని అరవిందను పెళ్ళి చేసుకుంటే అమ్మను చంపి తను చస్తానంటాడు."

కృష్ణమూర్తి నవ్వాడు... "చంపడం, చావడం ఈజీ అనుకున్నావేమిట్రా. ఒట్టి కబుర్లు. అంతే... ఆ నీకు చెప్పడం మర్చిపోయాను. మీ నాన్నను వాళ్ళ డిపార్ట్‌మెంట్ వాళ్ళు ఓ రెండు నెలల డిప్యుటేషన్ మీద మా నగరం పంపిస్తున్నారు. నాన్న మధ్యాహ్నమే ఫోన్ చేశాడు. రేపు కమలను తీసుకుని తను కూడా వస్తున్నాడు."

"మరి మీరు యాత్రలకు వెడుతున్నారు కదా??"

"ఈ ఊరు, మా ఇల్లూ ఆయనేం కొత్త కాదు. కొంతకాలం ఇద్దరూ మా యింట్లో వుంటే...." కృష్ణమూర్తి మాటలు ఆపాడు.

"అదేమిటి మావయ్యా?"

"చూదువుగాని... స్వకార్యం మీద వస్తున్న మీ నాన్నను మా ఇల్లూ, ఈ వాతావరణం, ఆఫీసు పన్లు చేసుకుని వెళ్ళిపోనివ్వదు. ఈ చెట్లూ, ఈ మొక్కలూ, ఈ పువ్వులూ.. మా బావ సీతాపతిని మురిపిస్తాయిరా, మైమరిపిస్తాయిరా..." కృష్ణమూర్తిగారు నవ్వుతూనే ఉన్నారు.

విశ్వం విస్తుపోయి మేనమామ వైపు చూశాడు. ఇంతలో అతని పక్కనే ఉన్న నీలి అంకెల అలారం 'వేళయ్యింది... లేవండి' అంటూ తన విద్యుద్ధర్మంగా గణగణమోగింది.

❖ ❖ ❖

"బావగారూ... మీరూ చెల్లాయీ ఇలా కాంప్ రూపంలో మా ఇంటికి రావడం మా అదృష్టం.. మీరీ విషయం ముందుగా వ్రాసుంటే మేం యాత్రకు వెళ్లేవాళ్ళం కాదు.." కృష్ణమూర్తి అన్నాడు.

"ఎలాగైనా మీ అన్నయ్య తెలివైనవాడు కమలా... ఓ రెండు నెలలు ఇక్కడ పడి తిందామనుకుంటే – చక్కగా పలాయన మంత్రం చదువుతున్నాడు.."

"అన్నీ చేయించుకుని - ఆ తర్వాత కొసమాటలు మాట్లాడ్డం మీ ఇంట ఉన్నదే!" కమల అంది చిరాగ్గా మొహం పెట్టి.

"ఆ మాత్రం అథారిటీ చేయడానికి మాకు హక్కు ఉందోయ్..."

"ఇంట ఆడపిల్లలులేక, వీళ్ళందరి కళ్ళు నెత్తినే వుంటాయి. అన్నయ్యా... ఎవర్ని చూడు, అహంభావం..."

"బావ సంగతి నీకు తెలుసు కదే... ఊరుకుంటే పోతుంది... బావగారి మాట పెళుసుగాని మనసు వెన్నే..."

ఇంతలో 'లలితాంటీ' అంటూ కృష్ణవేణి బయటి నుంచి వచ్చింది.

"ఈ అమ్మాయి..." సీతాపతి ఆశ్చర్యంగా చూశాడు. కృష్ణమూర్తి ఆమె గురించి చెప్పాడు. కృష్ణవేణి సీతాపతికీ, కమలకు నమస్కారాలు చెప్పి కృష్ణమూర్తిగారి పక్కనున్న కుర్చీలో కూర్చుంది.

"కృష్ణవేణి బోటనీలో రీసెర్చి చేస్తోంది. మన రాధిక లాస్ ఏంజిల్స్ వెళ్ళిపోతే, మాకు అది లేని లోటు ఈ అమ్మాయి తీరుస్తోంది."

సీతాపతి ఎక్కడికో చూస్తూ, "నిన్న ఇక్కడికి విశ్వంగారు వచ్చాడుటగా, ఫోన్‌లో చెప్పాడు. ఏమిటి విశేషం... మామా అల్లుళ్ళు ఏం మాట్లాడుకున్నారుట?"

"విశ్వం ఫక్తు దశరథ తనయుడు... వాడెప్పుడూ మీకే ఓటు వేస్తాడు. ఒకవేళ ప్రిఫరెన్స్ ఓటు మాకు వేయాలన్నా - మీరు ఒప్పుకోరుగా" కృష్ణమూర్తి నవ్వుతూ అన్నాడు.

"ఆ.... అదేం లేదు... వెధవ... ఒక్కమాటా నిజం చెప్పడు. నేను బ్రతికుండగానే గోతులు తీసే సుపుత్రుల్ని - ఇద్దర్ని కన్ది - మీ చెల్లెలు..."

"ఊరుకోండి బావగారూ. మీ పిల్లల రత్నాలు.. మీది ఒట్టి భయం... అంతే..."

"ఆయనంతే అన్నయ్యా... మొండితనం. ఎవరు చెప్పినా వినరు..."

కృష్ణమూర్తి నవ్వేసి, సీతాపతిని చూసి, "బావగారికి నాదో రిక్వెస్ట్... కృష్ణవేణి రోజూ మనింటికి వస్తుంది... మీకు తోడుగా వుంటుంది... కానీ బావగారు నాకో సహాయం చేయాలి" అన్నాడు.

సీతాపతి అనుమానంగా చూశాడు.

"బావగారూ... కమల వంట పని చూసుకుంటుంది. మీరూ, మా కృష్ణా కలిసి రెండు పూటలా మా మొక్కల సంరక్షణ చూడాలి. మా మొక్కలకు మేంలేని లోటు కనబడకుండా చేయాలి". సీతాపతి మాట్లాడలేదు.

"ఈ మొక్కలంటే నాకు ప్రాణం. అవి నన్నే కాదు. దగ్గరగా వచ్చిన వాళ్ళందరి హృదయాలను సేద దీరుస్తాయి... సేవకు సేవ... పుణ్యానికి పుణ్యం..."

"నేఉన్నానుగా అంకుల్... పెద్దవారు వారిని శ్రమ పెట్టడం దేనికి?"

"అలవాటయిన మనుషులు కనబడకపోతే మొక్కలు కూడా బెంగ పెట్టుకుంటాయిట

కదూ?" కమల అడుగుతోంది.

'నా బొంద పడతాయి... నీదో వెర్రి చాదస్తం' అనేసి సీతాపతి వాచీచూసుకుని, 'నాకు టైము అయ్యింది.... వెడతాను...' అంటూ బూట్లు వేసుకున్నాడు...

కృష్ణమూర్తి కమలా గుమ్మం దాకా వెళ్ళి సీతాపతికి వీడ్కోలు చెప్పారు.

కృష్ణమూర్తి కృష్ణవేణి వైపు తిరిగి "మీ అత్తయ్య బజారుకు వెళ్ళి గంట అయ్యింది. ఇంకా రాలేదు చూశావా? ఎక్కడికి వెడితే అక్కడే పాతుకుపోతుంది" అన్నాడు దూరంగా చూస్తూ.

"మీ ప్రయాణానికి కావల్సినవన్నీ కొనాలిగా, వచ్చేస్తూ వుంటారు."

"మీ ఆంటీ గుమ్మం దాటితే చాలు ఇంటిని మర్చిపోతుంది."

"అదేం కాదు అంకుల్... ఆంటీ బయటకు వెళ్ళినా మీ గురించే మాట్లాడతారు. మాట్లాడకపోతే మీ గురించే ఆలోచిస్తారు. ఆలోచించకపోతే మిమ్మల్నే ఫీలవుతూ వుంటారు".

"భక్తులు – దైవం గురించి పడే తపనలా అంటావ్... అవునా??" అని ఆగి, "కమలా... ఈ కృష్ణ బుద్ధిమంతురాలే కాదు... తెలివైంది కూడా... మా ఇద్దరి మధ్యనా జేరి మా మధ్య చాలా విభేదాలు రూపుమాపింది" అంటూ నవ్వేశాడు. కృష్ణమూర్తి.

"ములగచెట్టు ఎక్కించకండి మామయ్యా. వెళ్ళు బిడ్డా అనండి చాలు" అని వాచీ చూసుకుని, "అమ్మకూ నాన్నకు అన్నం పెట్టాలి. నేను వెడతాను, అంకుల్... సాయంత్రం స్టేషన్‌లో మిమ్మల్ని కలుస్తాను" అంటూ కమల వైపు చూసి తల ఊపి, ఇద్దరి పాదాలూ తాకి బయటకు వెళ్ళిపోయింది.

కృష్ణమూర్తి తనకు ఎదురుగా వున్న సోఫాలో కూర్చున్న చెల్లెలి వైపు చూశాడు ఓసారి. ఆ పైన, "నువ్వు బాగా నీరసంగా కన్పిస్తున్నావు..." అన్నాడు.

కమల మాట్లాడలేదు.

"బాధపడుతున్నావ్ కదూ..."

కమల తిరిగి మాట్లాడలేదుగానీ కళ్ళ వెంబడి నీళ్ళు చిప్పిల్లుతూంటే ఏమీ చేయలేకపోయింది.

"ఇదంతా – నువ్వు అనుకున్నట్టు – నువ్వు కోరుకున్నట్టు జరగలేదనే కదూ..." కమల మళ్ళీ మాట్లాడలేదు.

"నాకు తెలుసు కమలా... నీ సంసారం, బావగారి ప్రతాపం అన్నీ తెలుసు. బావ నిన్ను బాధ పెడితే, పుట్టింట్లో మేం అందరం విలవిల్లాడాం. ఇలా చాలా సంవత్సరాలు గడిచాయి... ఏం చేయగలిగావు నువ్వు... మేం ఏం చేయగల్గాం..."

"మనం ఏం చేయలేమనే ధీమాయే – ఆయన్ని మొండితనం వైపు లాక్కెళ్ళింది."

కృష్ణమూర్తి నవ్వేశాడు... 'కమలా, ఓ వ్యక్తిగా, ఓ ఇంటి ఇల్లాలుగా ఆలోచించకు. రః

మహాప్రస్థానంలో, అదే ఈ సంసారం ఈదడంతో నువ్వు నష్టపోయింది తక్కువే. పరోక్షంగా నష్టపోయిందీ ఓడింది బావ... అది తెలుసా నీకు?"

"అది కాదు అన్నయ్యా."

"మనం విధినీ, కర్మనూ మారుద్దాం అనుకుంటాం. నోటితో అరిచి, మేథతో తెగ మథనపడి తెలివి తేటలన్నీ రంగరించి ఏవేవో చేస్తాం... ఊహించింది. ఒకటి జరిగేది మరొకటీ అవుతుంది.... సహజీవనం, కలివిడితనం అనే మాటలకు బావ యిచ్చే అర్థం వేరు... మనం ఇచ్చే అర్థం వేరు..."

"నన్నేం చేయమంటావు..."

"నువ్వేం మాట్లాడకు. రోజులో ఎక్కువసేపు నిశ్శబ్దాన్నే పాటించు. బావ నిన్ను సూటిపోటీ మాటలన్నా, కయ్యానికి కాలుదువ్వినా రియాక్ట్ కాక... ఆయనగారు చెప్పేది నూటికి నూరుపాళ్ళూ ఆచరణీయం కాదని నీకు తెలుసు. అయినా ఎదుర్కోకు. ఆయన్ను కన్విన్స్ చేయాలని చూడకు. తన ఎదటి మనిషి తనతో పోటీగా నిలవనప్పుడే అలాంటి వాళ్ళ ఆత్మ తలవంచడం నేర్చుకుంటుంది. బావ నీ మీదకు రాయి విసిరితే, అది నీకు తగిలితే - ఏమీ కానట్టే వుండు. ఒకసారి, రెండుసార్లు, ఆఖరికి పదిసార్లు విసురుతాడు. ఆ తర్వాత రాయి విసిరే ఓపిక లేక, విసుగెత్తి ఆలోచనలో పడతాడు. ఆ తర్వాత మారడం అతని వంతు అవుతుంది... తప్పదు.."

"ఏమో అన్నయ్యా... వాసుగాడూ అంతే... బొంబాయిలో ఒక్కడూ ఉంటున్నాడు. పెళ్ళి సంబంధాలు వస్తున్నాయి... వాడేమో ఇప్పుడు చేసుకోను' అని కరాకండీగా చెప్పేస్తున్నాడు. పైగా ఏవేవో ఆశ్రమాలకు వెళ్ళి ఆ కబుర్లన్నీ నాకు వ్రాస్తాడు..."

"బావా, వాసుగాడూ మారే రోజు వస్తుంది... వాసుగాడికి ఈ ఊరు ట్రాన్స్‌ఫర్ చేయిస్తాను. వాళ్ళ యం.డి. నాకు ప్రాణ స్నేహితుడు. అయితే ఒక సంగతి..."

"ఏమిటి అన్నయ్యా...

"మన విశ్వంగాడు... ఎవరో అమ్మాయిని.."

కమల తలవొంచుకుంది...

"వాడి ముద్దు నాన్నా చెల్లించక, అమ్మా చెల్లించక బెట్టు చేస్తే ఎలానే కమలా... ఇప్పటి రోజుల బట్టి పోవాలి... వాడి కిష్టమైన అమ్మాయిని మీరు ఇష్టపడితే - వాడికి మీ మీద వేయింతల ప్రేమ, గౌరవ భావం వుంటాయి....కులాలూ గోత్రాలు అంటూ వాళ్ళిద్దర్నీ బాధ పెట్టడం..."

"నాదేం లేదు అన్నయ్యా... నేను నా పిల్లల దారికి అడ్డు వెళ్ళను... నిజం చెబుతున్నాను... తండ్రీ కొడుకులే పడ్డారు. ఎడమొహం పెడమొహం అయ్యారు..."

సరిగ్గా అప్పుడే గేటు తెరుచుకుని రెండు చేతుల్లో సంచీలు పట్టుకుని లలిత లోపలికి వచ్చింది.....కృష్ణమూర్తి, లలిత వైపోసారి చూసి, గోడగడియారం కేసి చూసి నవ్వేశాడు.

"ఆలస్యం అయిపోయిందండీ.. ఏంచేయను" అంటూ లలిత మాటలు మొదలుపెట్టింది.

కమల నవ్వేసి, ఫ్రిజ్ తెరిచి వదినగారికి మంచి నీళ్ళు ఇచ్చింది.

"బట్టలు సర్దాలి" అంటూ లలిత లేచింది. కృష్ణమూర్తి హాల్లో మూలనున్న సూట్ కేసులు చూపించాడు.

"ఈ పొందిక పన్లు కమలకే అలవాటు.. మీదేం లేదు" అంటూ లలిత భర్తను చూసి అంది.

❖ ❖ ❖

అప్పుడు సాయంత్రం ఐదు గంటలు దాటింది. సీతాపతి కమలా లాన్‌లో కూర్చున్నారు... చుట్టూ నిశ్శబ్దం... దూరంగా రోడ్ మీద నుంచి వెళ్ళే వాహనాల చప్పుడు చిన్నగా విన్పిస్తోంది... పక్కల వున్న పొలాల్లో ద్రాక్ష తోటల్లో పని చేసే కూలివాళ్ళు గుంపులుగా కలిసి ఏవేవో మాట్లాడుకుంటూ వెళ్ళిపోతున్నారు.

"మా అన్నయ్యది మంచి టేస్ట్...డబ్బు ఖర్చు పెట్టినా, శ్రమపడకపోతే ఇలా గార్డెన్‌ని అందంగా వుంచడం కష్టం..."

"అవును.."

ఇంతలో "నమస్కారం బాబయ్యగారూ, నమస్కారం ఆంటీ" అంటూ కృష్ణవేణి వచ్చి వంగి ఇద్దరి కాళ్ళకూ నమస్కరించింది.

"ఇలా పాదాలు తాకడం మన ఆచారం కాదు..." అన్నాడు చిన్నగా నవ్వి సీతాపతి.

"నార్త్ ఇండియాలో పిల్లలు పెద్దవాళ్ళు కనిపిస్తే పాదాలు తాకి, ఆశీర్వాదం తీసుకుంటారు నెమ్మదిగా ఇది సౌత్‌కు అలవాటవుతోంది."

"మీరు లేవండి... ఇద్దరూ కలిసి మొక్కలకు నీళ్ళు పోసేయండి... నేను టీ కలిపి తెస్తాను..."

సీతాపతి మొక్కలకు నీళ్ళు పోస్తుంటే కృష్ణవేణి చీర కుచ్చెళ్ళు పైకి దోపుకుని, చెట్ల పక్కన వంగి కూర్చుని, ఎండిన ఆకుల్నీ చెత్తనూ ఎత్తి పోస్తోంది... సీతాపతి పాండ్‌లోని వాటర్ లిల్లీలను పరీక్షగా చూస్తున్నాడు.

"ఇవి వాటర్ లిల్లీలు బాబయ్యగారూ... వీటికి ఎన్ని దళాలు ఉన్నాయో చూడండి... ఇవి మనకు ధనాన్ని యిస్తాయి. తిరిగి ఆ ధనాన్ని భగవంతుడికే అర్చించగల ఆకాంక్షనూ పెంచుతాయి.."

సీతాపతి నవ్వేశాడు... "మనకేం మిగలదన్న మాట..."

కృష్ణవేణీ నవ్వేసింది. "ఇవి చూడండి... ఇవో రకం క్రోటన్లు... అసలు ఏ క్రోటనయినా మనలో పుట్టే తప్పుడు ఆలోచనల్నీ, దురుద్దేశంతో ఎవరైనా ఇచ్చే చెడు సలహాల నుంచీ మనల్ని కాపాడుతూ వుంటాయి..."

"అయితే ఉత్తమ పురుషుల అవతారాలన్న మాట..."

"ఇది మరీ ఆశ్చర్యకరమైన చెట్టు - బాబయ్య గారూ... సంరక్షణ చేస్తూ వుంటే ఇలా పాకుతూనే వుంటుంది. ఇందులో క్లయింబింగ్ లిల్లీ... ఫ్లేమ్ లిల్లీ... గ్లోరీ లిల్లీ అని ఎన్నో రకాలు... ఇవి ఏ ఇంటిలో పెరుగుతాయో ఆ ఇంటిలో మనుషుల మధ్య అభిప్రాయ భేదాలూ పోట్లాటలూ వుండవు..."

కమల ఆశ్చర్యంగా వాటిని చూస్తూ అంది "వీటిని మా ఇంటిలో తప్పక వేసుకోవాలమ్మా.. మీ బాబయ్యగారిలో ఉండే కీచులాట గుణానికి ఇవే మందు. నేను బ్రతికి పోతాను..."

కృష్ణవేణి, కమల దగ్గరకు వెళ్ళి ఆవిడ్నోపక్కగా తీసుకువెళ్ళి, "ఆంటీ ఇది మెలినా తీగ... ఇది దొడ్లో ఉంటే - ఆ ఇంట్లో మనుషులకు సుభాషితాలు పలకడం ఒకటే అలవడుతుందిట" అంది.

సీతాపతి అటుగా వచ్చి " ఈ గుబురు లేమిటమ్మా" అన్నాడు.

"ఇవి పుం బ్లేగో జైలానికా పొదలు. మనల్ని ద్వైదీభావాలకు గురికాకుండా చేసి మనసుకు నిర్మలత్వం ప్రసాదిస్తాయి. ఇవి చూడండి. దీని పేరు లీప్ కేక్టస్ అంటారు. ఇవి అబద్ధాల కోరుల నోరు మూయించి - వాళ్ళను నెమ్మదిగా నిశ్శబ్దపరుల్ని చేస్తాయి..."

సీతాపతి వెనుక వైపు ప్రహారీగోడను ఆనుకని నుంచున్నాడు. ఆగోడను చాపలా గ్రాస్ ఉంది.

"గడ్డి" అన్నాడు సీతాపతి.

"దీని పేరు ఫింగర్‌గ్రాస్ అంటారు. చూడ్డానికి ఇలా వుందా. ఇది మనుషుల పాలిట వరం. మనిషి తను చేసిన తప్పులకు పశ్చాత్తాపం పడేటట్టు చేస్తాయి. మనిషిలో పెనుమార్పు తెస్తుంది."

సీతాపతి పకపకా నవ్వేశాడు. ఏదో పుణ్యం కదా అని మొక్కలకు నీళ్ళు పోశాను. కానీ నువ్వు చెప్పే కథలు మాత్రం నమ్మబుద్ధి కావడం లేదు. మాకు ఎంత బోటనీ రాకపోయినా - ఎకౌంట్స్ వాళ్ళమయినా ఇలా చెవిలో పువ్వు పెట్టేస్తే ఎలా అమ్మా..."

కృష్ణవేణి, నెమ్మదిగా అంది. "దేనిమీదైనా నమ్మకం ఉండాలి బాబయ్యగారూ, నమ్మకం లేని వాళ్ళు నరక వాస్తవ్యులే అవుతారు."

"ఒట్టినే అభూతకల్పనలను చేయడానికి ఆ అమ్మాయికేం అవసరం" అంది కమలా విసుగ్గా!!

వారం పది రోజులు గడిచాయి. పొద్దున్నే సీతాపతీ కమలా కలిసి మొక్కలకు నీళ్ళు పోస్తున్నారు. ఆ సమయంలోనే సూర్యోదయం అవుతుంది. కమలకు మొక్కల మధ్య తిరుగుతూ ఉంటే ఉదయకాంతి పూల పరిమళాలు కలగలుపై హృదయపు లోతులను తాకుతోన్నట్టుగా అన్పిస్తోంది. సీతాపతికి ఒక్కొక్క రోజు విసుగు అన్పిస్తుంది. మొక్కలను

చూస్తే కోపం లాంటిది కల్గుతుంది. మళ్ళీ అంతలోనే మొక్కలు – పూలు తన ఆంతర్యాన్ని కనిపెడతాయేమోనని భయం. డాబా మీద నిద్రపోయే ముందు కృష్ణవేణి చెప్పే పూలగుణాలు గుర్తొస్తాయి. అదోలా అన్పిస్తుంది. రకరకాల పువ్వులు రివ్వు రివ్వున తన గుండెల్లో దూరి లోలోపల తమ పరిమళాలతో విన్యాసాలు చేస్తోన్నట్టుగా తోస్తుంది. 'నీళ్ళు పోసి తనదారిన తాను పోకుండా కృష్ణవేణి పూలగుణగణాల గురించి తనకెందుకు చెప్తుంది? తనని ఆట పట్టించాలనా?" అని.

"ఈ పారిజాతాలుటండీ, మనల్నీ మనలో చైతన్య శక్తిని ముక్కుకు తాడేసి దైవం వైపు మళ్ళిస్తాయిట. పూర్వం ఇవి స్వర్గంలో ఉండేవట. కొన్ని పువ్వులు వాడవుట. ఇంతెందుకు? మనం సహృదయంతో పూలను చెట్టు నుంచి వేరు చేసి దేవుడికి అర్పిస్తే అవి కళకళలాడుతూనే ఉంటాయిట. పువ్వు కోసే వ్యక్తి నైజం మీద వాటి లైఫ్ ఆధారపడి ఉంటుందిట."

"నమ్మాల్సిందే!"

"ఈ బటర్ఫ్లయ్ లిల్లీలు మనిషిలో సచ్చిదానందపు అనుభూతుల్ని పెంపొంది స్తాయిట..."

"మంచిది – అవి కోసి పక్కలో పరుచుకుని పడుకో. సంసారం, ఈ భవబంధాల్ని వదుల్చుకుని సుఖపడొచ్చు."

కమల నవ్వేసింది. ఆ పైన నెమ్మదిగా అంది. 'మీరు నేను అదృష్టం చేసుకున్నామేమో! లేకపోతే మీరూ నేను ఇలా రావడం, నందనవనం లాంటి ఈ వాతావరణంలో ఉండడం జరిగేది కాదు. చెప్పండి నిజమేనా?'

'ఊరుకుంటావా?'

కమల ఏదో గుర్తుకొచ్చినట్టు అంది. "పాపం కృష్ణ వాళ్ళింటికి రమ్మనమంటోందండి... రేపు సాయంకాలం వాళ్ళింటికి వెడదామా..."

"దేనికి'?

"వాళ్ళ నాన్నగారూ అమ్మగారూ మనల్ని చూడాలనుకుంటున్నారుట..."

"ఏం చూస్తారుట... లేకపోతే విశ్వంగాడికి ఏమైనా సంబంధాలు చెబుతారా?"

కమల నవ్వేసింది. ఆ తర్వాత 'నిద్రవస్తోంది, నాకు అంది'. సీతాపతి కూడా ఆవలించి నెమ్మదిగా నిద్రలోకి జారిపోయాడు. కమల భర్తవైపు చూసింది. నిద్రపోతూన్న భర్తను చూస్తే ఆమెకు అమితమైన అనురాగం కలుగుతుంది. ఏమీ తెలియని పసివాడు. సృష్టి పాడిన జోలపాటకు కన్ను మూసిన చందాన ఇట్టే నిద్రలోకి వెళ్ళిపోతాడు.

మాట్లాడకపోతే ఈయనంత ఉత్తములు లేరు. పాడు నోటితో చెడ్డ పేరు తెచ్చుకుంటున్నారని ఎన్నోసార్లు మధనపడేది. ఇప్పుడు ఆ బెంగ లేదు. అన్నయ్య చెప్పిన మంత్రం పాటిస్తోంది. పదిసార్లు పలకరిస్తే 'ఏమిటి' అనడం 'ఎక్కడా కమలా' అని

వందసార్లు కేకవేస్తే 'వస్తున్నా' అని నెమ్మదిగా అనడం, 'అలా ముభావంగా ఉన్నావేం' అంటే 'మామూలుగానే ఉన్నానని' జవాబివ్వడం...

కమల పక్క మీద నుంచి లేచి డాబా పైదాకా పాకివచ్చిన ఫింగర్ గ్రాస్ కొద్దిగా తురిమి నెమ్మదిగా భర్త తలగడా కిందకు తోసింది. ఆమెకు ఎంతో నమ్మకంగా ఉంది. సీతాపతిలో మార్పు వస్తుందని.

❖ ❖ ❖

మరో పదిహేనురోజులు గడిచాయి. సీతాపతికి ఇప్పుడు ఉదయం నాలుగు గంటలకే మెలకువ వస్తోంది. లేచి ఆరుబయట కుర్చీ వేసుకుని కూర్చుంటాడు. లేకపోతే కాలకృత్యాలు తీర్చుకుని స్నానం చేసి కాఫీ కలుపుకుని తాగి కమల కోసం ఫ్లాస్క్‌లో కాఫీ పోసి ఉంచుతాడు. నిశ్శబ్దంలో మొక్కలవైపు చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. అవి దగ్గరగా వున్న తోటి చెట్ల వైపు వాలి గాలి కబుర్లు చెబుతోన్నట్టుగా ఉంటుంది.

"మొక్కలకు గ్రహణశక్తి ఉంటుంది" అంటూ ఎంతో నమ్మకంగా చెప్పే కృష్ణవేణి మాటలు ఆయనకు తరుచు గుర్తొస్తూ ఉంటాయి...

ఆయన కుర్చీలోంచి నెమ్మదిగా లేచి క్రోటన్ మొక్క దగ్గరకు వెళ్ళాడు. ఆకుల్ని అప్రయత్నంగా ఆప్యాయతతో తడిమాడు. యూక్లిప్టస్ చెట్టు కింద రెండు నిముషాలు నిలబడ్డాడు. క్లయింబింగ్ లిల్లీపువ్వుల్ని కోశాడు. తిరిగి కుర్చీలో కూర్చున్నాడు. ఆలోచనలు ఎటో పోయి, పోయి విశ్వం వైపు తిరిగాయి. వాడు తనతో, తను వాడితో మాట్లాడిన మాటలు మనసులో కదిలాయి. ఆ సంఘటన ఆర్నెల్ల క్రితం జరిగింది. వాడు తలవంచుకని నిలబడి తన ప్రేమ కథ అరవింద అనే అమ్మాయి గురించి చెబితే తను ఆకాశమంతెత్తు ఎగరడం, తనని ఆవేశం పాలుకాకుండా ఆపబోయిన కమలను పరుష వాక్యాలతో తిట్టడం... అన్నీ గుర్తొచ్చాయి. కమల డాబా మీద నుంచి దిగి వచ్చి భర్తను చూసి ఆశ్చర్యపోయింది. "ఏం చేస్తున్నారు? మొక్కలకు నీళ్ళు పోసేశారే!"

"ఆ, నా స్నానం అయ్యింది. కాఫీ తాగాను.'

"నన్ను లేపలేకపోయారా... ఒక్కరూ అవస్థపడ్డారా!" ఆశ్చర్యంగా అడిగింది.

"మంచి మూడ్ వచ్చింది... కమలా" నవ్వుతూ అన్నాడు సీతాపతి.

మర్నాడు సీతాపతి యధావిధిగా నాలుగు గంటలకే లేచి తన పనులు పూర్తి చేసుకుని – ఆ తర్వాత మొక్కలన్నిటికీ నీళ్ళు పోసి పారిజాతం చెట్టు కింద కుర్చీ వేసుకుని కూర్చున్నాడు. ఇంకా చీకటిగానే ఉంది.

కుర్చీలోకూర్చున్న సీతాపతిని ఏకాకిగా వదలడం ఎందుకని, ఏమీ పనిలేని ఆలోచనలు చటుక్కున ఆయన శిఖరాగ్రాన చోటు చేసుకున్నాయి. ఇంకా తాము తలకెక్కినా గమనించని సీతాపతి పరాకుగా ఉన్నాడని అర్థం చేసుకుని మరికొంచెం సాహసించి లోపలకు ప్రవేశించాయి. సీతాపతి అప్పుడు పైకి చూశాడు. ఆలోచనలన్నీ మొదట చిందర వందర

అయ్యాయి. పాతిక సంవత్సరాలుగా జరిగిన జీవితంలోని కొన్ని కొన్ని జ్ఞాపకాలు వామన రూపంగా మరికొన్ని విరాట్ స్వరూపంగా కళ్ళ ముందుకు వచ్చి నిలబడుతున్నాయి. ఆఫీసులో ఉద్యోగిగా, కమల భర్తగా, ఇంటి యజమానిగా ఆఖరికి తండ్రిగా తను పోషించిన పాత్రలోని బలహీనతలు గుర్తుకు వస్తున్నాయి. తనేం చేశాడు? జీవితాన్ని జీవించలేక, జీవితంతో పోరాడలేక - ఓటమిని మనసా స్వీకరించలేక - దారి తప్పాడు. ఒడిలిన అనుభవాలకు దహన సంస్కారం చేయకుండా నెత్తిన కిరీటమల్లే ధరించాడు. విజయాలు వరించినప్పుడు - తన ప్రజ్ఞ అనుకుని వాటిని భుజకీర్తులుగా ధరించి మురిసిపోయాడు. నెమ్మది నెమ్మదిగా బ్రతుకు తేలుకుట్టిన దొంగకు ప్రతి రూపం అవసాగింది. ఆఫీసులో అవినీతికి తలుపులు తెరచాడు. డబ్బు విలువ అర్థం కావడం మానేసి అవసరాలకు అనవసరాలకు మధ్య దూరం తెలియకుండా పోయింది. భార్యగా కమలకు ఇవ్వవల్సిన స్థానంలో ఆఫీసు స్టెనో కామేశ్వరికి రహస్య స్థావరం కల్పించాడు. పిల్లలు నిరాదరణకు లోనయ్యారు.

చుట్టాలూ స్నేహితులూ చెవులు కొరుక్కోవడంతో మొదలయిన తన స్వవిషయం - పదిమందికి తెలిసింది. అహంకారం, అజ్ఞానం, తనలోని మంచి తనం మీద దాడి చేసి నిరాయుధుణ్ణి చేయడం జరిగిపోతూ వచ్చింది. నలుగురు కలిసి నవ్వినా, ఆప్తులు హితవు చెప్పినా పట్టించుకోలేదు.

కమలకూ, తనకు - పిల్లలకూ, తనకు మధ్య కనబడని దూరం ఏర్పడింది. ఇన్నాళ్ళ తరువాత, యాభై ఏళ్ళు దాటిన అనంతరం జరిగిందేమిటో మిగిలిందేమిటో లెఖ్ఖలు వేసుకుని చూస్తే కనబడుతోంది. తనను అందరూ ఉత్తముడనుకోవాలనే భ్రాంతి, అందరూ తనని విమర్శిస్తున్నారనే అనుమానం. ఈ అంతర్మథనం నుంచి తప్పించుకుందుకే తను హైదరాబాద్ వచ్చాడు. వచ్చి నెల దాటిపోయింది. రెండో నెల గడుస్తోంది. బావగారు, లలితా, కృష్ణవేణి కొత్తగా వింతగా కన్పిస్తారు. వాళ్ళ జీవన విధానం, మాటతీరు, వ్యవహార సరళి ఆశ్చర్యంగా ఉంటాయి. వాళ్ళు జీవితాన్ని జీవిస్తోన్నట్టు ఉంటుంది తప్ప నటిస్తోన్నట్టు ఉండదు. మాట్లాడే ప్రతీమాటా హృదయపు లోతుల్లోంచి వస్తోన్నట్టుగా ఉంటుంది. కృష్ణమూర్తీ, కృష్ణవేణీ, తరచు 'ట్రూత్ కాన్షస్‌నెస్' అనే మాట వాడుతూ ఉంటారు. మాట హృదయాంతరాళాల్లోంచి వస్తే అది పలుకూ అవుతుంది. ప్రణవమూ అవుతుందంటారు. పెద్దలు!! వాళ్ళని చూడ్డం మొదలుపెట్టిన తర్వాత, చనువు పెరిగిన తరువాత తనలో పాతుకుపోయి, మేటలు వేసిన హిపోక్రసీ మీద ఏవగింపు కలగడం మొదలయ్యింది.

సీతాపతి ఎందుకో అటూ ఇటూ కదిలాడు. ఆలోచనల తీవ్రతకు హృదయం తట్టుకోలేక పోయిందేమో.... దాంతో ఓసారి కళ్ళు మూసి తెరిచాడు. మూలగా, గుబురుగా ఉన్న మందార చెట్టు కన్పించింది. ఆ తర్వాత అది మనిషయి తనకు దగ్గరగా వస్తోన్నట్టు

కాదు కాదు తనే హఠాత్తుగా ఓ మహావృక్షంగా మారిపోయినట్టు... సీతాపతి కళ్లు నులుముకున్నాడు. తూర్పు నుంచి విచ్చుకుంటూన్న లేత వెలుతురు శరీరాన్ని కొత్తగా నిమురుతూ ఉంటే కళ్ళు తెరిచాడు.

అంతలో గేటు ముందు టాక్సీ ఆగింది. సీతాపతి కుర్చీలోంచి లేచాడు. టాక్సీలోంచి కృష్ణమూర్తీ లలితా దిగారు. వాళ్ళ వెనుకే ఓ అమ్మాయి దిగింది.

"ఎలా వున్నారు బావగారూ?"

"అదేమిటీ... మీరు రావాల్సింది ఈ వేళ కాదు కదా..." ఆశ్చర్యంగా అడిగాడు.

"మధ్యలో ఒకటి రెండు ప్రదేశాలు అక్కడి అల్లర్ల వల్ల చూడలేకపోయాం. అందుకే రెండు రోజుల ముందుగా వచ్చేశాం..." కృష్ణమూర్తి అన్నాడు.

ఇంతలో డాబా మీద నుంచి కమల వచ్చి అన్నగార్నీ వదిన్నీ చూసి "యాత్ర బాగా జరిగిందా వదినా" అని ప్రశ్నించి, లలిత పక్కన ఉన్న అమ్మాయిని చూసి, "ఈ అమ్మాయి" అని ఆగిపోయింది.

"మాతోపాటు వీళ్ళూ యాత్రలకు వచ్చారు. వీళ్ళది విజయవాడ. రేపు సోమవారం ఈ అమ్మాయికి ఈ ఊళ్ళో ఇంటర్వ్యూ ఉందిట. వెనక్కీ ముందుకూ ప్రయాణాలు తప్పుతాయి ఈ రెండు రోజులు మా ఇంట్లో ఉందువుగాని రమ్మన్నాం. ఆ అమ్మాయి పేరు అరవింద. యం.యస్.సి చదివింది. ఈవిడ ఆడబడుచుగారు. పేరు కమల..." అంది లలిత.

అరవింద కమలకు నమస్కారం చేసింది.

ఆ సాయంత్రం కృష్ణమూర్తీ, లలితా, అరవిందా కలిసి ప్రసాదాలు ఇవ్వడానికి స్నేహితుల ఇంటికి వెళ్ళారు. కమలా సీతాపతి లాన్‌లో కుర్చీలు వేసుకుని కూర్చున్నారు.

"ఆఖరి సారి మొక్కలకు నీళ్ళు పోశాం. చూడండి అవి ఎలా మెరిసిపోతున్నాయో..." అంది నవ్వుతూ..

"మనం వెళ్ళిపోయిన తర్వాత మన గురించి బెంగ పెట్టుకుంటాయేమో" అన్నాడు సీతాపతి.

"నిజమే. అప్పుడప్పుడు ఉత్తరాలు రాద్దాం. వాటిని అన్నయ్య చదివి విన్పిస్తాడు."

సీతాపతి "మన ప్రయాణం పదిగంటల బస్‌కే. అన్నీ సర్దినట్టేనా.."

"ఆ భోజనాలు చేసి వెళ్ళడమే..."

ఇద్దరూ కాసేపు మాట్లాడుకోలేదు. కమల అటూ ఇటూ చూసి అంది.

"నాకయితే ఈ వాతావరణం నచ్చిందండీ... ఈ ఊరు వచ్చేద్దాం... అక్కడ ఇల్లు అమ్మేసి చిన్న యిల్లు వేసుకుని చుట్టూ మొక్కలు పెంచుకుందాం..."

"అవును కమలా... నాకూ అదే అన్పిస్తోంది" అని ఏదో గుర్తు వచ్చినట్టు ఆగి, –

– "ఆ క్లయింబింగ్ లిల్లీ, పారిజాతం మొక్కలు పట్టుకు వెడుతున్నాం. వాటితోపాటు

కృష్ణవేణి ఇచ్చిన లొబిలియా ఎరినస్ ప్లాంటు మర్చిపోకు. చాలా ముఖ్యం."

"ఆ మొక్క గుణం ఏమిటండీ"

"అది శ్రీ అరబిందో ప్రపంచానికి నివేదించిన పూర్ణయోగ మార్గాన్ని ఎల్లప్పుడూ గుర్తు చేస్తూ ఉంటుందిట..."

"ఆశ్చర్యం..."

"అంతా ఆశ్చర్యంగానే ఉంది..."

కమల భర్తవైపు తిరిగి "మీరు బాగా మారారండి నిజం..." ఎంతో ఆనందంగా, తృప్తిగా అన్నది.

"అంటే"

'అంటే ఏం లేదు."

"చెప్పరాదా,"

"నాకు నచ్చినట్టు..."

"నీకు నచ్చినట్టు మారితే బాగా ఉన్నట్టూ, లేకపోతే కానట్టూనా?" సీతాపతి వేళాకోళంగా అన్నాడు.

"నాకు కాదు, అందరికీ నచ్చినట్టు... భగవంతుడు మెచ్చేటట్టు..."

సీతాపతి గలగలా నవ్వేశాడు. అంతలో నవ్వాపి, ఏదో గుర్తుకు వచ్చినట్టుగా, "అవును... నిన్ను ఒకటి అడగాలనుకున్నాను. అదే, ఆ అరవింద అనే అమ్మాయి... మీ అన్నయ్యతో వచ్చింది చూడు. ఆ అమ్మాయి ఎవరై ఉంటుందంటావ్?"

"మీ అనుమానం ఏమిటిట?" అంది కమల.

'కమలా! విశ్వంగాడు ప్రేమించానని చెప్పాడు, చూడు.. చదువుకుంది, అందంగా ఉంటుంది. వాళ్లు మనవాళ్ళే.. పేరు అరవింద అని.... బహుశా ఆ అమ్మాయే ఈ అమ్మాయని నా అనుమానం...'

కమల మొదట ఆశ్చర్యపోయి, నెమ్మదిగా కుడిచేత్తో తలకొట్టుకుని ఆ పైన నవ్వేసింది. "మళ్ళీ మొదలయ్యాయా మీ అనుమానాలు. నాకర్మ. కృష్ణవేణి అదేదో మొక్క పేరు రాసిచ్చింది. ఇంట్లో వేసుకోమంది. అది దొడ్లో ఉంటే – మనిషికి ఏది మాట్లాడాలో ఏదీ మాట్లాడకూడదో, మితంగా ఎలా మాట్లాడాలో అలవాటవుతుందిట. దాని పేరు ఆ ... గుర్తుకొచ్చింది. 'ఆల్ పినియా గాలెంగా'ట. మన ఊరు వెళ్ళగానే కొంటాను."

సీతాపతి తలవంచుకుని 'అలాగే కానియ్" అన్నాడు.

ఇంతలో కృష్ణమూర్తి లలితా అరవిందా వచ్చారు. గబగబా వంట పనులు పూర్తయ్యాయి. ఆ తర్వాత అందరూ కుర్చీలు వేసుకుని కూర్చున్నారు. కృష్ణమూర్తి డాబా మీదకు వెళ్ళాడు. వెనకే సీతాపతీ వెళ్ళాడు. ఇద్దరూ డాబా మీద కూర్చున్నారు. కృష్ణమూర్తి టూర్‌లో చూసిన ప్రదేశాల గురించి చెప్పాడు. సీతాపతి అన్నీ విని, "ఓ విషయం నిన్ను అడగాలని ఉంది..."

అన్నాడు, నెమ్మదిగా.

"ఏమిటీ?"

"మీతో వచ్చింది చూడు... అరవింద. చూడ్డానికి బుద్ధిమంతురాలిగా కన్పిస్తోంది. ఎవరమ్మాయి".

"మా స్నేహితుడి కూతురు... ఏం అలా అడిగారు?"

"అది కాదు నేనడిగేది. ఆ అమ్మాయి?"

"మీ సంశయం ఏమిటో అడగండి బావగారూ!!"

"కృష్ణమూర్తీ... విశ్వంగాడు కేంప్‌ల మీద ఈ ఊరు వస్తూనే ఉంటాడు. వాడికి నచ్చిన అమ్మాయి నిచ్చి పెళ్ళి చేయడానికి నాకేం అభ్యంతరం లేదు. ఒకవేళ – మీకు నచ్చిన సంబంధం ఏదైనా ఉన్నా చూడు. వాడి పెళ్లి కానిచ్చేద్దాం. ఎందుకంటే పెద్దాడు ఇప్పట్లో పెళ్ళి చేసుకునేటట్టు లేదు."

కృష్ణమూర్తి నెమ్మదిగా అన్నాడు. 'ఇదేమిటి బావగారూ! మీ చిన్న కొడుకు బాధ్యత నాకు ఒప్పగిస్తున్నారు. ఏదో వేళాకోళం చేస్తున్నట్టున్నారు'.

"లేదు కృష్ణమూర్తీ... మంచి పనిచేయడానికి ఎవరు ముందుకు వచ్చినా హర్షించవలసిందే. నేను, నాది అని అనుకోవడం, తప్పని ఇన్నాళ్ళకు తెల్సుకున్నాను. వెనకా ముందూ ఆలోచించకుండా ఎదుటి వాళ్ళను బాధపెట్టడానికీ, దుఃఖపెట్టడానికీ వెనకాడని నాకు భగవంతుడు ఏ శిక్ష రాసి పెట్టాడో నాకయితే తెలియదు. అంతా ఆయన నిర్ణయించిన ప్రకారమే జరుగుతుంది."

"బావగారూ! ఈ అమ్మాయి అరవింద" కృష్ణమూర్తి ఏదో చెప్పబోయాడు. ఇంతలో లలితా కమలా డాబా మీదకు వచ్చారు.

"వారికి బస్ టైము అవుతోంది. ఆయన్ని మీరు కబుర్లలో పెడితే ఎలా? మన వాచ్‌మెన్ ఆటో తేవడానికి వెళ్ళాడు. కిందకు వెడదాం పదండి" అంది లలిత.

అందరూ డాబా దిగి కిందకు వచ్చేసరికి ఆటో వచ్చింది. సీతాపతి కమలా సామాన్లతో ఆటో ఎక్కారు. వీడ్కోలు చెప్పి లలితా కృష్ణమూర్తి ఇంట్లోకి వచ్చారు. అప్పుడు అరవింద చిన్న చాప మీద కూర్చుని నిశ్శబ్దంగా మెడిటేషన్ చేసుకుంటోంది. కృష్ణమూర్తి లలితను బైటకు తీసుకువెళ్లి "అరవింద అదృష్టవంతురాలు" అన్నాడు నవ్వుతూ.

"అంటే"

"మా సీతాపతి బావ అనుమానపడినా అమ్మాయిని సగం అంగీకరించాడు."

"అంటే..."

"అంటే..." అంటూ కృష్ణమూర్తి చెప్పడం మొదలుపెట్టాడు.

❖